ఇమ్మానుయేలు

(దేవుడు మనకు తోడైయున్నాడు)

మొదటి ప్రసంగము

యేసుక్రీస్తు ప్రభువు సర్వలోక రక్షకుడుగా జన్మించినాడు గనుక ఆయన వార్త సర్వలోకస్థులు వినతగినదే. యేసుక్రీస్తు ప్రభువునకుగల నామధేయములలో ఒక నామధేయము "ఇమ్మానుయేలు" ఇది హెబ్రీ భాషా పదము. దేవుడు మనకు తోడైయున్నాడని దీనియర్థము. మనము ఒంటరిగా నుండుట మనకు ఇష్టముండదు. ఇంటనున్నను, బైటకు వెళ్ళినను మనకు ఎవరో ఒకరు తోడుండవలెను. ఇది మనుష్యుని కోరిక. ఎవరైన మనకు జతగా నుండుట మన కోరిక. జతగా పెంపుడు జంతువు మనదగ్గరనున్నయెడల అది జతయేగాని మనుష్యుని జతవంటి జతకాదు. అయితే "ఇమ్మానుయేలు" అను మాటకు మనుష్యుడు మనకు తోడు అని అర్థముకాదు. దేవదూత మనకు తోడైయున్నాడని అర్థముకాదు. గాని బారుగా దేవుడే మనకు తోడైయున్నాడని "ఇమ్మానుయేలు" అను మాటలో నున్నది. జంతువు తోడైయున్న కొంచెము సంతోషమే! మనుష్యుడు తోడైయున్న అంతకన్న ఎక్కువ సంతోషము. "దేవుడు" తోడై యున్నయెడల అన్నిటికంటే గొప్ప సంతోషము. "ఇమ్మానుయేలు" అను "క్రీస్తు" అను నామములో దేవుడు తోడైయున్నాడని వ్రాయబడియున్నది. గాన ఆ మాట ఎవరికి ఇష్టమైయుండదు. ఆ మాట అర్థముగల "క్రీస్తు" పేరు ఎవరికి ఇష్టముండదు. అంతగొప్ప అర్థముగల "క్రీస్తు" నామమే ఇష్టములేకున్న మరి ఏ పేరు ఇష్టమై యుండగలదు? "క్రీస్తు" నామము మీకు స్మరణ నిమిత్తమై మేమందిదిచినయెడల దేవుడు మీకు తోడై యున్నాడు అని మిమ్మును మేము దీవించినట్టే. మేము ఇంత గొప్ప నామముతో ఇంత గొప్ప వాక్యముతో మిమ్మును దీవించినయెడల ఆ వాక్యము మాకెందుకు? ఆ దీవెన మాకెందుకు? ఆ పేరు మాకెందుకు? అని అనువారు ఎవరైనా ఉందురా! లోకములో "ఇమ్మానుయేలు" అను మాట మన భాషాపదము కాదని తృణీకరించు వారుందురా! మన భాషాపదము కాకపోయిన మాత్రమున దీవెన ఫలము కాకపోవునా! "ఇమ్మానుయేలు" అను పదము పర భాషాపదము అయినంత మాత్రమున దానివలన కలుగు దీవెన

తగ్గిపోవునా? తగ్గిపోదు గదా! ఇమ్మానుయేలు అనుపేరు కొందరు క్రైస్తవులు పెట్టుకొనుచున్నారు. గాని అట్టివారు దీని అర్థము గ్రహించుకొనిన ఈ దీవెన కలుగును. విన్నవారు నమ్మిన ఈ దీవెన కలుగును. నమ్మినవారు స్వీకరించిన ఈ దీవెన కలుగును. స్మరించినవారు ప్రకటించిన ఈ దీవెన కలుగును. 'ఇమ్మానుయేలు' అను పేరుగల "క్రీస్తు" లోకమునకు దానమైయున్నారు. ఈ దానమును ముఖ్యముగా క్రిస్టుస్ కాలములో జ్ఞాపకము తెచ్చుకొందుము. ఒకమాటతో ముగించెదను. ఆ మాట "ఇమ్మానుయేలు" అను పరభాషయందలి మాటయేగాని తెలుగునందు మరొకసారి చెప్పి ముగిస్తాను వినండి, జ్ఞాపకముంచుకొనండి. అదేదంటే దేవుడు మనకు తోడైయున్నాడు. దేవుడు మనకు తోడైయున్నాడు. దేవుడు మనకు తోడైయున్నాడు. తథాస్తు, తథాస్తు, తథాస్తు. ఇదే నా "క్రిస్టుస్ కాల వర్తమానము.

రెండవ ప్రసంగము

"యేసు" ప్రభువుయొక్క ఒక పేరు "ఇమ్మానుయేలు" అనగా దేవుడు మనకు తోడని యర్థము. అయితే "ఇమ్మానుయేలు" అను ఆ ఒక్క చిన్న పేరునందు గల మాటలు కొంచెము వివరింతును. ఆ పేరులో దేవుడు అను ఒక మాట యున్నది. "దేవుడు" అనుమాట అందరికి సమ్మతియైన మాట. దేవుడనుమాట అన్నిమతములవారు వాడుచున్నారు. దేవునికి మొక్కవలెనని అన్ని మతములవారు అనుకొనుచున్నారు. "క్రైస్తవులు" "క్రీస్తు" అనుమాట వాడుచున్నారుగాని, హిందువు ఆ మాట వాడరు. 'హిందువులు' 'క్రిష్ణుడు' అని వాడుచున్నారుగాని క్రైస్తవులు వాడరు. 'మహమ్మదీయులు' 'అల్లా' అను మాటను. క్రైస్తవులు, హిందువులు, మహమ్మదీయులు అందరు వాడుదురు. అభ్యంతరములేదు. ఆ మాటయే 'ఇమ్మానుయేలు' అను మాటలో నున్నది. గాన యేసుక్రీస్తు యొక్క ఈ పేరు అన్ని మతములవారు సమ్మతించుటకు వీలైన పేరుగా కనబడుచున్నది. ఎందుకందురా! "ఇమ్మానుయేలు" అను పేరులో దేవుడు మీకు తోడైయున్నాడు. యావత్తు దేవుడున్నాడు. దేవునిలో రెండవ భాగములేదు. దేవుడనగా పూర్తియయిన దేవుడు. యేసుక్రీస్తుయొక్క ఈ పేరులో దేవుడే యున్నాడు గాన ఉన్నవాడు దేవుడే

గనుక మనమందరము సంతోషించవలసినదే, మ్రొక్కవలసినదే. "యేసుక్రీస్తు" యొక్క ఈ పేరులో దేవుడున్నందువలన ఈ పేరు గొప్ప పేరు. సర్వలోకమునకు అనుగుణ్యమైన పేరు. ఈ పేరు స్మరించినపుడు పలుకునప్పుడు దేవుడే జ్ఞాపకమునకు వచ్చును. భాష భేదముగాని అర్థమొక్కటే. హెబ్రీ భాషయందు "ఎల్" అందురు. 'ఎల్' అనగా దేవుడని అర్థము. ఇదివరకు చెప్పినట్లు భాష తేడాయేగాని అర్థము ఒకటియే. దేవుడని మనము ఎప్పుడందుమో అప్పుడే దేవుడు మనకు తోడైనట్టే, దేవుడు మన దగ్గర నున్నట్టే, దేవునిని మనము దేవునిగా మర్యాద చేసినట్టే. ఇది ఎప్పుడైనా విన్నారా! మన భాషలో ఎన్నిమాటలు గలవో ఆ అన్ని మాటలలోకెల్ల ఈ మాట గొప్పమాట. దేవుడను మాటయే గొప్పమాట. ఈ మాటకు ముందు మరి ఏ గొప్పమాటలేదు. ఇదియే మొదటి తెలుగు గొప్ప మాట. తరువాత మాటలు ఈ మాట తరువాత మాటలే! అది ప్రత్యేకమైన మాట. "ఇమ్మానుయేలు" అను మాటయందు ఎవరెవరు గలరు? దేవుడను మనమునుగలము. దేవుడెక్కడో ఆకాశమునందును, మనము పాతాళమునందును లేము. ఇద్దరము ఒక్కచోటనే యున్నాము. చూచినారా "ఇమ్మానుయేలు" యను క్రీస్తుపేరు ఎంత గొప్పపేరో! దేవుడను, మనుష్యుడును కలిసియున్న నామము గొప్పదికాదా! దేవుడు మనము కలిసియే యున్నాము. మనము వెళ్ళి దేవుని దగ్గరలేము. ఆయన మన దగ్గరకు వచ్చి మన దగ్గర నున్నాడు అని దీనియర్థము. ఆయన ఎక్కడనున్నాడో మనకేమి తెలియును? ఒకవేళ తెలిసిన ఆయన దగ్గర కెట్లు వెళ్ళవలయునో? ఈ రెండును మనకు తెలియవు. అనగా ఎచ్చటనున్నాడో తెలిసికొనుట మనవల్లకాదు. ఎలాగు వెళ్ళవలెనో అది మనవల్ల కాదు. గాన ఆయన మన దగ్గరకు వచ్చివేసినాడని ఈ పేరులో కనబడుచున్నది. ఆయన మన దగ్గరకు వచ్చుట ఎంత గొప్ప కథ! ఎంత వింతైన కథ! ఈ కథ ఎంతో చోద్యముగా నున్నది. దేవుడే మన దగ్గరకు వచ్చివేయుటవల్ల మనము ఎంత ధన్యులము. "ఇమ్మానుయేలు" అనగా ధన్యతగల మాటయైయున్నది గాన ఈ పేరును మనము ఎంతగా కన్నులకు అద్దుకొనవలసి యున్నది. ధ్యానింపవలసియున్నది. మీకు శుభము కలుగును గాక! "ఇమ్మానుయేలు"

అనుమాట (నామము) లో మూడవ మాట ఒకటి ఉన్నది. ఆ మాట ఏదనగా 'తోడై' యుండుట. ఈ మాట ఒక గొప్ప మాటయే. దేవుడు అనునది ఒక గొప్పమాట. ఆయన మనకు తోడైయుండుట అనునది ఆయన మన విషయములో చేయు గొప్ప పని. ఆయన మనకు తోడైయుండక పోయిన యెడల మన దగ్గరనున్న ప్రయోజనమేమి? ఆయన మనకు తోడైయున్నాడు. ఇది ఆయన చేయు గొప్ప ఉపకారము. మనకు ఒక మనుష్యుడు జత యున్నంత మాత్రముననే ఎంతో సంతోషము. దేవుడే జత యున్న యెడల మరింత సంతోషముగదా! దేవుడు మన దగ్గర నున్నయెడల ఊరకనే యుండడు. గాని మనకు తోడుగా నుండును. కష్టకాలములో మనకు సహాయము చేయగలడు. "క్రిస్టస్" అను పండుగ ఎంత గొప్ప పండుగో "ఇమ్మానుయేలు" అను 'క్రీస్తు' నామములో బైలుపడిపోయినది. ఈ పండుగలో ఎవరున్నారు? దేవుడును, మనమును యున్నాము. గొప్ప పండుగ గదా! ఈ పండుగలో దేవుడు మనకేమి చేయుచున్నాడు. తోడైయున్నాడు. తోడైయుండుట ఒక గొప్ప పండుగకాదా! (క్రిస్టస్) పండుగ అనగా తుదకు ఏమి తేలినది? ఎవరి పండుగైనట్టు?– దేవుని పండుగ – ఎందుకు దేవుని పండుగ – దేవుడు మనకు తోడైయున్నాడు గనుక ఆయన లేనిది సంతోషము లేదు. మనము అనగా ఎవరము క్రైస్తవులమా? ఇతరులమా? మనమనగా ఎవరమోచెప్పుదును. మనము అనగా నరజన్మమెత్తిన మనమందరము ఏ మతస్థులైనా, ఏ దేశస్థులైనా, ఎంత పాపాత్ములైననేమి! దేవుడు మనకు తోడైయున్నాడు. ఈలాగున సంతోషించుటయే (క్రిస్టస్సు) పండుగ. యేసు క్రీస్తు అనుపేరులో దేవుడున్నాడని సంతోషించుటయే "క్రిస్టస్సు" పండుగ దేవుడు మన దగ్గరకు వచ్చుట వలన సంతోషించుటయే (క్రిస్టస్) పండుగ. దేవుడు మనకు తోడైయున్నాడని మురియుచున్న యెడల నిజముగా మురియుచున్న యెడల (క్రిస్టస్) పండుగ చేయుచున్న యెడల దుఃఖ మెందుకుండును! జబ్బేమి చేయలేదు. దయ్యాలేమి చేయలేవు. దేవుడే మనకు తోడైయుండగా మరి ఎవరును తోడై యుండనవసరములేదు. 'దిక్కులేని వారికి దేవుడే దిక్కు' అని యనుకొను

చున్నారుగదా! ఆ యర్థమే ఇందులో నున్నది. దేవుడు మనకు దిక్కెయున్నాడు. ఇంతవరకు ఒక చిన్న ప్రసంగము వినిపించియున్నాను. అదేదనగా దేవుడు మనకు తోడైయున్నాడు (క్రిస్తుసు) సలాములు.

మూడవ ప్రసంగము

'ఇమ్మానుయేలు' అను మాటలో దేవుని గురించియు, మనలను గురించియు, ఆయన చేసిన ఉపకారములను గురించియు చెప్పినాను. అయితే (ఇమ్మానుయేలు) అను (క్రీస్తు) పేరును గూర్చి ఈ దినమున కూడ రవ్వంత చెప్పవలసియుండును. అదేమనగా ఇమ్మానుయేలు అను పేరు తలంచుకొన్న యెడల భాగ్యము. దేవుడున్నాడని నమ్మగల వారందరికిని దేవుడు తోడైయుండిన ఎంత ఉపకారమో ఈ నామమంత ఉపకారము. మరియు దేవుడు ఎంత గొప్పవాడో అంతగొప్ప నామము. దేవుడు మనకు తోడైయుండిన మనకు కలిగే ఉపకారమేమి? అని కొందరు అడుగుదురు. దీనికి ఒకటే జవాబు తోడైయుండుటయే ఉపకారము. ఆ ఉపకారముతోపాటు అన్ని ఉపకారములు కలుగును (ఇమ్మానుయేలు) అను మాట మన భాషలోని మాటకాదు. ఏ భాషలోని మాటయని చెప్పినాను. అది (హెబ్రీ) భాషలోని పదమని ఇదివరకే చెప్పితిని. అయితే (హెబ్రీ) భాషలోకి అది ఏ భాషనుండి వచ్చినది. అది మోక్ష లోకములో నుండి వచ్చినది. మోక్షము కోరువారందరికిని ఇది ఉపయోగకరమైన స్మరణ నామము. మోక్షమనగా ఎవరికిష్టముండదు. అందరికిష్టమే గనుక (ఇమ్మానుయేలు) అనగా అందరికి ఇష్టముగా నుండవలెను. (యేసుక్రీస్తు ప్రభువు) యొక్క ఈ పేరు అందరకు ఇష్టముగా నుండవలెను. మన భాషలోని పేరుకాదు గనుక ఈ పేరు ఎందుకు స్మరింపవలెను అని అందురేమో! ఇది స్వదేశపదముకాదు, విదేశ పదముకాదు. పరలోక నామము. గనుక అందరకు అనుగ్రహింపబడిన నామము. మనము అందరము ఎన్నటికైనను మోక్షమునకు వెళ్ళవలెను. గనుక ఈ మోక్ష లోకనామము మన భాషానామమే. మన దేశనామమే, పరదేశనామమే, స్వదేశ నామమే. మోక్షలోకమునుండి వచ్చిన (ఇమ్మానుయేలు) యను నామము ఎవరి కొరకని

ఉద్దేశింపబడినది. మన కొరకే పరభాషాపదము అనుటకు వీలులేదు. ఒకవేళ ఎవరైన పరబాషాపదము మనమెందుకు వాడవలెనని సందేహించిన అట్టివారిమీద ముందు వేయు ప్రశ్న ఏదనగా ఇంగ్లీషుభాష విదేశభాష మనము నేర్చు కొనుటలేదా! మానివేయుచున్నామా? తెలుగువారికి, అరవభాష పరభాష కాదా! మన తెలుగు వారు అది నేర్చుకొనుటలేదా!ఈ మహమ్మదీయులకు తెలుగు భాష పరభాషకాదా! వారు తెలుగుభాష నేర్చుకొనుటలేదా! ఇండియా ప్రజలకు బర్మా భాష పరభాషకాదా! మనవారు నేర్చుకొనుటలేదా! లోకభాషలే మనవారు అంగీకరించినప్పుడు మోక్షలోకభాష ఎందుకు అంగీకరింపకూడదు? లోక భాషలలోని మాటలలో మనకు ఉపయోగముండగా, పరలోకభాషలోని, మోక్షలోక భాషలోని (ఇమ్మానుయేలు) అను పదము మనకు అంతకంటె మరి ఎక్కువ ఉపయోగకరముగా నుండదా? (ఇమ్మానుయేలు) అనుమాటయును (క్రీస్తు) అను మాటయును (యేసు) అనుమాటయును పరలోకమునుండి వచ్చినవే గాన, భూలోకమునందున్న మనము ఈ పేరులు వాడిన మోక్షలోకమునకు వెళ్ళకముందే భూలోకములోనే మోక్ష లోకభాష మాట్లాడినట్లుండును. ఎలాగనిన మనము (అమెరికా) వెళ్ళకముందు (ఇండియా) లోనేయుండి (అమెరికా) భాష మాట్లాడుచున్నాము గదా! ఆ భాష మాట్లాడుటవలన అనగా విదేశ భాష మాట్లాడుటవలన కథ నడుచుచున్నదిగదా! అలాగే (యేసుక్రీస్తు) నామములో ఒక నామమైన (ఇమ్మానుయేలు) అనుమాటయును (యేసు) అను మాటయును (క్రీస్తు) అను మాటయును భూలోకములో వాడుకొన్నందున దైవభక్తిగల జీవిత కథ బాగుగా నడువగలదు. చివరకు లెక్క ఎక్కడకు తేలినదనగా మోక్షలోకమునకు వెళ్ళకుండనే, భూలోకములో ఉండగానే మోక్షము సంపాదించుకొందుము. ఎంత ధన్యులము. ఇంతవరకు వచ్చినది కథ. ఇంకొక సంగతి ఏమనగా దేవుడు మనకు తోడైయున్నాడు అను నాలుగు మాటలుగల వాక్యము ఒక్క మాటలో చెప్పవలెనని "ఇమ్మానుయేలు" అనిన చాలును. సూక్ష్మములో మోక్షము అన్నట్లుగా యుండును. మరియొక సంగతి ఏమనిన "ఇమ్మానుయేలు" అనుపేరు (యేసుక్రీస్తు)

కొందరు తమ బిడ్డలకు పెట్టుకొనుచున్నారు. బాబూ ఇమ్మానుయేలు అని తల్లి పిలిచేటప్పుడు దేవుడు మనకు తోడైయున్నాడని, అనగా అబ్బాయీ దేవుడు నీకు, నాకు తోడైయున్నాడను ఉద్దేశముతోకదా! పిలుచుచున్నది. పిలిచిన యెడల ఫలము పొందకపోదు. (ఇమ్మానుయేలు) అను నామములో ఎంతైన యున్నది. ఆ అంతయు ఆమెకు ప్రాప్తించిన యెడల 'అంతయు' అనగా ఏమి చెప్పగలరు? దేవుడు మనుష్యునికి ఎంత సహాయము చేయగలడో, ఎంత ఇవ్వవలెనని యనుకున్నాడో దానికే 'అంతయు' అని అర్థము. మోక్షలోకములోని మాట మనము తరుచుగా పలుకగలందులకు మనకు ఎంత తేలికైనది. నమ్మిన యెడల మోక్షముకూడా తేలికేసుమండీ! 'నమ్మువానికి సమస్తము సాధ్యమే' అను మాట ఈ సందర్భములో జ్ఞాపకము వచ్చుచున్నది 'క్రిస్టమస్' పండుగకు "ఇమ్మానుయేలు" నామమునకు సంబంధముగలదు. ఎందుకందురా? (క్రిస్టమస్) కాలములో అనగా యేసుప్రభునియొక్క జన్మకాలములోనే జన్మకథలోనే (ఇమ్మానుయేలు) అను ఈ పేరు చూచుచున్నాము. అయితే ఇంకొక సంగతి ఈ పేరు ఎప్పుడు మోక్ష లోకమునుండి వచ్చినదా! యేసుక్రీస్తు ప్రభువు పుట్టకముందు ఎనిమిదివందల ఏండ్ల క్రిందట యెషయా అను ఒక దైవభక్తుడు, దైవసన్నిధానమందు ఉండగా ఈ పేరు ఆయనకు మొదటనే అందియున్నది యెషయా 7:10. ఆయన తన గ్రంథములో వ్రాసియుంచినాడు. ఆయనకు మోక్షలోకములోనుండి ఏ విధముగా వినబడినదనిన చెప్పుదును వినండి 'కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలు అను పేరు పెట్టును' ఈ మాటలు భవిష్యత్తుగా చెప్పబడినవి నెరవేరినవి గనుకనే లోకరక్షకుడు జన్మించినాడు. నిజముగా ఆయన ఒక కన్యకకు జన్మించినాడు. ఆ (యేసుక్రీస్తు) ప్రభుని పేరే ఇమ్మానుయేలు. ఇమ్మానుయేలు అనగా యేసుక్రీస్తు ప్రభువు అనగా మనదగ్గర ఉండే ప్రభువు అని అర్థము. దేవుడు దగ్గర ఉన్నయెడల మనకు అక్కరలేదా! తప్పకుండా దేవుడు మనకు కావలయునుగదా! యేసుక్రీస్తు ప్రభువు యెషయాకు ఇమ్మానుయేలు కన్య మరియమ్మకు ఇమ్మానుయేలు, నాకు ఇమ్మానుయేలు, నీకు ఇమ్మానుయేలు.

నాలుగవ ప్రసంగము

ఇదివరకు మూడుమార్లు ఇమ్మానుయేలు అను మాటకు దేవుడు మనకు తోడు అని వివరింపబడెను. ఈ మాటలో దేవుడు అనుమాటయు, మనము అనుమాట ఉన్నవి గనుక దేవుడు మన జత అని వివరింపబడెను. దేవుడు అనేమాట ఉన్నందున దేవుడు మీ దగ్గర ఉందునా? అని ప్రశ్నింపడు. మీకు తోడైయుందునా? అని ప్రశ్నవేయడు. మీరు అనే ఒకరు ఉన్నారా? అని ప్రశ్నవేయడు. మనమే ప్రశ్నవేయుదుము. ఇమ్మానుయేలు అను ఆయన సందేహము గల ప్రశ్నవేయడు గాని, ఇమ్మానుయేలు అనుమాట విన్న మనమే ప్రశ్నవేయుదుము. సందేహింతుము. ఏలాగనగా మనుష్యులలో కొందరు దేవుడనే ఆయన ఒకడు ఉన్నాడా? అని ప్రశ్నింతురు. దేవుడు ఉన్నాడని నమ్మేవారుకూడ ఒకానొకప్పుడు ప్రశ్నవేయుదురు. దేవుడు మనకు తోడైయుండునని మీరు చెప్పినారుగదా, మొన్న నాకొక కష్టము వచ్చినది. దేవుడు నాకు ఎందుచేత తోడైయుండలేదు. దేవుడు తోడైయుండిన కష్టము నెందుకు తొలగించలేదని ప్రశ్న వేయుదురు. దేవుడున్నాడను వారు లేడనువారుకూడ సందేహింతురు. నరుల కథ ఇట్లున్నది. మనమని చెప్పుకొను మనము ఇమ్మానుయేలు అను మాటలోనున్న అర్థమును నమ్మకపోయిన ఆయన సహాయము కలుగునా? కొన్ని విషయములలో కలుగును. కొన్నిటిలో కలుగదు. దేవుడు మనలను కలుగజేసెను గనుక నమ్మిన, నమ్మకపోయిన ఉపకారము చేయుచున్నాడు. ఎండ, వాన, గాలి ఇవన్ని దేవుని ఉపకారములే మనము ఆయనను అడగకపోయినను చేయుచున్నాడు. ఎందుకనగా ఆయన దేవుడు గనుక; ఇంకా ఎందుకనగా మనలను కలుగజేసినాడు గనుక; ఇంకా ఎందుకనగా మనకు ఉపకారము చేయుట ఆయన స్వభావము గనుక. దేవుడు మనకు తోడైయున్నాడను సంగతి సర్వసామాన్యమైన సంగతి. ఈ సర్వసామాన్యమైన అర్థము ఇమ్మానుయేలను మాటలో ఉన్నప్పటికిని ఒక ప్రత్యేకమైన అర్థముకూడ దీనిలో నున్నది. అది గుర్తించండి. లోకములోనున్న మానవులను రక్షించు

నిమిత్తము పుట్టవలసిన యేసుక్రీస్తు ప్రభువునకు ఇమ్మానుయేలను పేరు ప్రత్యేకమైన పేరు. ఎలాగనగా ఇమ్మానుయేలను మాట క్రొత్తమాట. భూమి పుట్టి నాలుగువేల సంవత్సరములైన తరువాత క్రీస్తు ప్రభువు అవతారమెత్తెను. ఇమ్మానుయేలను పేరు అప్పుడు బయలుపడినది. అంతకుముందు ఎనిమిది వందల సంవత్సరములకు ముందు బయలుపడెను. అంతకుముందు బయలు పడలేదు. ఈ పేరు బయలుపడక ముందును తరువాతను, ఇప్పుడును ఇక నెప్పుడును అన్ని మతముల వారును వాడకొను మాట దేవుడు అనుమాట గాని ఇమ్మానుయేలను మాటకాదు. ఈ పేరు క్రీస్తుయొక్క అవతారకాలమందు పెట్టబడినది. ఇది దేవుని పేరు. అందరు వాడుమాటకాదు. అందరు వాడునది దేవుడు అనుమాట. ఆ దేవుడు మోక్ష లోకమునుండి భూలోకమునకు దిగివచ్చి యేసుక్రీస్తుగా ప్రసిద్ధికెక్కినాడు. గనుక యేసుక్రీస్తు అను పేరు దేవునికి ఉన్న ప్రత్యేకమైన ఒక పేరు. అలాగుననే ఇమ్మానుయేలను పేరుకూడ ఒక ప్రత్యేకమైన పేరు. దేవుడు ప్రత్యేకమైన దేవుడు కాడు. దేవుడు అందరికి దేవుడు. దేవుడు ఒక్కడు గాని ఆయన పనులు అనేకములు. జ్యోతులను కలుగజేయుట, భూమిని కలుగజేయుట, అందున్న సమస్తమును కలుగజేయుట, అనుదినము చెట్లను, జీవరాసులను కలిగించుట, తాను కలుగజేసిన సృష్టిని కాపాడుట ఇవన్ని దేవుడు చేయు ఘనమైన పనులు. వీటన్నిటిలో మహాముఖ్యమైన పని, మహా ఘనమైనపని ఈ పనులన్నిటిలో ప్రత్యేకమైనపని క్రిస్టును కాలమునందు బయలుపడినది. ఆదేదనగా దేవుడు మనిషి దగ్గరకు వచ్చివేసినాడు. ఈ సంగతి ఇమ్మానుయేలను మాటలోనున్నది. దేవుడు మనిషి దగ్గరకు వచ్చివేయుట అనునది గొప్పపని కాదా! దేవుడు మోక్షలోకమునుండి భూలోకమునకు ఉపయోగకరమైన పనులు చేయుట గొప్పనంగతి. మనుష్యులు సంతోషించుసంగతి గాని ఆయనే భూలోకమునకు వచ్చివేసిన సంగతి మరింత గొప్ప సంగతి. మరింత సంతోషకరమైన సంగతి. ఉదా: తండ్రి దూరదేశములో నుండి కుమారునికి ఉత్తరములు వ్రాయుచు, సొమ్ము పంపించుచు అన్ని సహాయములు చేయుచున్నాడు. కుమారునికి సంతోషము. గాని ఈ

సంతోషముకన్న గొప్ప సంతోషము ఎప్పుడు కలుగును? తండ్రి కుమారుని యొద్దకు వచ్చినప్పుడు కలుగును. ఇమ్మానుయేలను మాటలో ఇటువంటి గొప్ప కారణము ఉన్నది. ఇది ప్రత్యేకమైన కార్యముకాదా! రెండు సంగతులు 1) దేవుడు యేసుక్రీస్తుగా రాకముందు ఇతర సహాయములు చేయుచునే యున్నాడు. 2) దేవుడు యేసుక్రీస్తుగా వచ్చి చేసిన సహాయ క్రియలు కూడ ఉన్నవి. ఈ రెండు రకములైన ఉపకారములకు తేడాగలదు. ఈ రెండు ఉపకారములు మనిషికి అవసరమే. ఈ రెండు ఉపకారములు మనిషి కొరకే. ఈ రెండు ఉపకారములు చేసిన దేవుడు ఒక్క దేవుడే! ఈ ఒక్క దేవుడే చేసిన మొదటి ఉపకారము మాకు కావలెనని, రెండవ ఉపకారము అనగా క్రీస్తుయొక్క దైవావతార ఉపకారము మాకు అక్కరలేదు అంటే అర్థమేమి? మొదటి ఉపకారము కావలెనా? మొదటి ఉపకారముకంటె ఎక్కువైన అవతార ఉపకారము అక్కరలేదా? అక్కరలేదను వారివిూదనే ఈ ప్రశ్న. ఆ ఉపకారములు, ఈ ఉపకారములు రెండును కావలెనను వారికి ఈ ప్రశ్న వేయుము. యేసు క్రీస్తు వారియొక్క జీవిత చరిత్ర చదువుకొను వారికి రెండవరకముల ఉపకారములు తెలియగలవు. ఆయనచరిత్ర మత్తయి, మార్కు, లూకా, యోహాను అను సువార్తలలో గలదు.

మరియొక ప్రశ్న. మేము ఇప్పుడు చెప్పినది కొందరు నమ్మనే నమ్మరు. వారికి రెండవ రకపు మేలు కలుగునా? కలుగదు. నమ్మకపోయిన ఈ భాగ్యము కలుగదు. ఈ రెండవరకపు భాగ్యము మోక్షలోక సంబంధమైనది. నమ్మకమునుబట్టియే కలుగును గాని మరొక దానినిబట్టి కలుగదు. దేవుని సహాయము ఎల్లప్పుడు సిద్ధమే. దైవోపకారము నిత్యము మనకొరకు సిద్ధమై యుండును గాని మనము నమ్మకపోయిన ఆ ఉపకారము ఎట్లు కలుగగలదు. దేవుడు మనకు ఉచితముగా మోక్షభాగ్యములు ఇస్తానంటే నమ్ముట కష్టమా? అనుమానములు తీసివేసికొని నమ్మినయెడల పరమ భాగ్యము కలుగును. అది యేసుక్రీస్తు ప్రభువు వలన కలుగును. నీవు నమ్మకపోయిన నమ్మువారు లేరా? భూమివిూద నేడు ఒక గొప్ప సంఘమున్నది. ప్రతి దేశములో నున్నది. ఆ సంఘము నమ్మేసంఘము. ఏమి నమ్ము సంఘము? దేవుడున్నాడని

నమ్ము సంఘము. ఇంకా దేవుని సహాయము మనకుండునని నమ్ము సంఘము. ఇంకా ఆ సహాయము మనకు అని నమ్ము సంఘము. ఇట్లు నమ్ముటకు ఋజువు ఏమిటి అని అడుగు పెద్దమనుష్యులుందురు. ఆ ఋజువులు కావలెనని కోరువారు లోకములో పుట్టకముందే, దేవుడు ఆ ఋజువులు, సాధనములు అమర్చియుంచినాడు. ఏలాగనగా అన్నవస్త్రాదులు, ధనధాన్యములు మొదలైనవి మనకు ఇచ్చుట లేదా? ఇవి ఇచ్చే దేవుడు పరమభాగ్యములు ఎందుకు ఇవ్వడు? ఇదే ఋజువు. ప్రతివారు ఇమ్మానుయేలు పేరులోని పరమభాగ్యము నమ్మి అనుభవింపవలెననినా కోరిక.

మరియొక సంగతి మనకు అనుమాట. ఇది ఏకవచనము కాదు అనగా ఈ ఉపకారము ఒక మనిషికి మాత్రముకాదు. 'మనకు' అనుమాట బహువచనము అనగా నమ్మువారందరికిని అని అర్థము. మనిషి నమ్మిన, నమ్మకపోయిన యేసుక్రీస్తు ప్రభువు లోకమునకు వచ్చియున్నాడు. అందరు నమ్మువరకు రాకుండా నుండలేదు. నమ్మినయెడల ఆయనవలన కలుగు ఉపకారభాగ్యము పొందగలము. 'మనకు' అనుమాట బహువచనము గనుక ఆ మాటలో గొప్ప సంఘము మన మనో దృష్టికి కనబడుచున్నదిగదా! దేవుడు ఒక్కడే. సంఘము ఒక్కటే. సహాయము ఒక్కటే అని ఈ మూడును ఇమ్మానుయేలు అను మాటలో గలవు అనగా మనకు అను మాటలో సహోదరప్రేమ ఉన్నది. మీరెప్పుడైన చూచినారా? అది విశ్వాసులందరిని కలుపుకొనుమాట. ఇమ్మానుయేలని పలుకువారు విశ్వాసులు. ఆ మాట అంగీకరించువారు విశ్వాసులు. అందుచేత మనకు అనుమాట సరియైన మాట. విశ్వాసులు విశ్వాసులు కలిసికొన్నప్పుడు (ఇమ్మానుయేలు) అని చెప్పుకొని సంతోషించుట మంచిది. విశ్వాసులందరు విశ్వాసులకును విశ్వాసులందరికి దేవుడును దగ్గరైనారు. దూరముగా లేరు. విశ్వాసులు కూడ ఒకరికి ఒకరు దూరముగాలేరు. విశ్వాసుల సంఘము దివ్యమైన సంఘము. అదే ఈ దినములలో మనకు కావలసినది.

ఇంగ్లీషు క్రైస్తవులు స్నేహితులను విడిచిపెట్టి వేరుచోటకు వెళ్ళునప్పుడు (షేక్‌హేండ్) (Shake hand) చేతులు కలుపుకొంటూ "God be with you"

(గాడ్ బి విత్ యు) అని అంటారు. దీని అర్థము ఏమనగా దేవుడు మీకు తోడై యుండునుగాక! ఈ అర్థము ఇమ్మానుయేలును బట్టి వచ్చి యుండును. మరియు అరవ క్రైస్తవులు, తెలుగు క్రైస్తవులు ఒక పేరు పెట్టుకొనుచున్నారు. అది దైవ సహాయము అనుపేరు. ఆ పేరుకూడ (ఇమ్మానుయేలు) అను మాటకు అర్థము అనగా దైవసహాయము మనకు కలిగియుండునుగాక! అని అర్థము మన అందరకు దైవసహాయము అగత్యము.

యేసు : యేసు అనునది క్రీస్తుయొక్క మరొక పేరు. ఇదికూడా స్వదేశ నామముకాదు. ఏ దేశనామముకాదు. అసలు భూలోక నామమేకాదు. మోక్ష లోకమునుండి వచ్చిన నామము. గనుక సర్వలోకమునకు అన్ని దేశములకు ఉపయోగకరమైన నామము. యేసు అను మాటకు రక్షకుడని అర్థము. రక్షకుడు అనగా ఎటువంటివాడు, మానవులను పాపములనుండి రక్షించు రక్షకుడు, వ్యాధులు, కరువులు, భూకంపములు, అపాయములు, జంతు బాధలు, విష పురుగులవలన బాధలు, శత్రుబాధలు, ఎండబాధ, చలిబాధ, వరదబాధ, ముండ్ల బాధ. ఈ మొదలైన బాధలు మనుష్యునికి కలుగుట పాపము వలననే లోకములో పాపము అనేది లేకపోయిన ఈ శ్రమలు ఉండకపోవును. ఈ శ్రమలకు కారణమై యున్న పాపములనుండి రక్షించు రక్షకుడైన యేసుప్రభువు అనగా యేసుక్రీస్తు ప్రభువు గొప్ప రక్షకుడు కాడా! ఈ శ్రమలన్నిటికంటె ఎక్కువ హానికరములైన పాపములనుండి యేసుక్రీస్తు ప్రభువు మనలను రక్షించగలిగిన ఈ శ్రమలనుండి కూడ రక్షించగలడు. ఈ శ్రమలన్నిటికన్న ఎక్కువ హానికరమైన శ్రమ, ఆఖరు శ్రమ మరణము. మరణముకూడ పాపమువలన వచ్చినదే. పాపము లేకపోయిన మరణము కూడ లేనేలేదు. పాపములనుండి రక్షించు యేసు ప్రభువు మరణమునుండి కూడా రక్షించగలడు. మరణమైన తరువాత మరణము కంటె మరణమైయున్న నరకమునుండికూడ ఆయన రక్షించగలడు. నరకముకూడ పాపమునుబట్టి వచ్చును. పాపములనుండియు, శ్రమలనుండియు, మరణము నుండియు రక్షింపగలవాడు యేసుక్రీస్తు ప్రభువే. ఇప్పుడు మనకు ఈ సంగతి

అంత వివరముగా తెలియదుగాని ఈ లోకము దాటిపోయిన తరువాత మనము పరలోకములో శాశ్వతకాలము జీవించునప్పుడు యేసుక్రీస్తు ప్రభువు మరణము నుండి నరకమునుండి రక్షించెనని తెలిసికొనగలము. అక్కడకు వెళ్ళిన తరువాత ఇక చావు ఉండదు. యేసు అనగా రక్షకుడు. రక్షణ ఎవరికి అక్కరలేదు అది అందరికి కావలెను గదా! పాపమునుండి రక్షింపబడుట అక్కరలేదనువారు ఉండరు. కాబట్టి యేసు అనే పేరు స్మరణ కోరనివారుకూడ ఉండకూడదు. అనగా యేసుక్రీస్తు వారియొక్క నామస్మరణ అక్కరలేనివారు ఉండకూడదు. అయినను ఉన్నారు. ఏమి చేయగలము? యేసుక్రీస్తు వలన కలిగే ఈ ఉపకారములు గొప్ప ఉపకారములు అని మీకు తోచిన, యేసు అనే పేరు ఎంత గొప్ప పేరు అయినది కూడ మీకు తోచును. యేసుక్రీస్తు పేరు ఎంత గొప్ప పేరైనది. అదికూడ తెలియును. తెలిసినవారందరు రెండు చేతులు జోడించి యేసుక్రీస్తు ప్రభువా! మమ్మును పాపములనుండి రక్షించుము. శ్రమలనుండి రక్షించుము, మరణభీతి నుండి రక్షించుము నరకమునుండి రక్షించుము. శాశ్వతమైన మోక్షలోక జీవితము అనుగ్రహించుమని ప్రార్థింపగలరు. అప్పుడు మనము మోక్షలోకమునకు వెళ్ళి అక్కడనుండి భూలోకమునకు తొంగిచూచిన యెడల ఓహో యేసుక్రీస్తు ప్రభువు మనలను పాపములనుండియు, శ్రమలనుండియు, మరణమునుండియు, నరకమునుండియు ఎంత చక్కగా రక్షించినాడు! అని ఆశ్చర్యపడుదుము. మరియు ఆయన మనలను ఎంత గొప్ప సుఖజీవనముగల శాశ్వతానంద లోకములోనికి తీసికొని వచ్చినాడు అని చెప్పుకొందుము.

యేసు అనుమాట భూలోక భాషలోలేదు. భూలోక భాషలలోనున్న నిఘంటువులలోలేదు. ఆ మాట పరలోకమునుండి వచ్చినది. మనము భూలోక భాషలో ఆ మాట వాడుచున్నాము. ఎందుకనగా ఆ నామము మన రక్షణార్థము దొరికినది. యేసు అను పేరు పలుకుట సులువేగాని, యేసువలన రక్షణ అని నమ్ముట సులువుకాదు. యేసు ప్రభువుయొక్క ఒక ముఖ్య శిష్యుడు ఒకసారి

ఉపన్యాసములో ఏమి చెప్పినది వినండి. అది బైబిలులోనున్నది. 'మరి ఎవరివలనను రక్షణ కలుగదు ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము.' అపో. కార్య 4:12. క్రైస్తవులకు కష్టము వచ్చినప్పుడు యేసుప్రభువా! యేసుప్రభువా! అని అందురు. అనగా దాని అర్థమేమి? రక్షకా! రక్షకా! అని అర్థము. భూలోక భాషలో రక్షకా అన్నట్లు మోక్షలోక భాషలో యేసు, యేసు అన్నట్టు హిందువుల పుస్తకములో నున్న (యేసు) అను ఈ పేరు ఆ పుస్తకములోనికి ఎట్లు వచ్చినదో! ఆ గ్రంథకర్తకు ఎట్లు బయలుపడినదో విచారింప వలసినది (యేసు)– శ్రీశుష్క వేదాంత తమోభాస్కరము 174వ పేజీలోనున్నది. ఇమ్మానుయేలను పేరులో దేవుడని ఉన్నది. యేసు అనుపేరులో రక్షకుడని ఉన్నది. ఇప్పుడు ఇమ్మానుయేలను పేరులో దేవుడు మన దగ్గరనున్నట్లు విశదమగుచున్నది. యేసు అనుపేరులో ఆయన రక్షకుడు అన్నట్లు కనబడుచున్నది. దేవుడు ఎంత గొప్పవాడైతేనేమి మనలను రక్షించకపోతే దేవుడు యేసుగా బయలుపడినాడు. ఆయనను పూజిస్తామా? దేవుడు దేవుడుగా మాత్రదమేగాక రక్షకుడుగా బయలుపడినాడు. ఒకడు గొప్పవాడని తెలిసిన గొప్పగానే గౌరవింతుము. ఎంత గొప్పవాడైనను మనకుసహాయము చేయనియెడల గౌరవింతుమా? దేవుడు గొప్పవాడు. తనంతటతానే గొప్పవాడైయున్నాడు. ఆయన గొప్పతనము తగ్గదు. అయితే ఆయన గొప్పవాడను సంగతి ఎప్పుడు అనుభవమునకు వచ్చును? ఆయన మనలను రక్షించునప్పుడే వచ్చును. యేసు అనుమాటలో ఆయన రక్షించేవాడుగా ప్రత్యక్షమైనాడు. పాపము మనిషిని పడవేసినది. గనుక పాపము మనిషిని జయించినది. యేసుప్రభువు వచ్చి పాపాత్ముని రక్షించినాడు గనుక పాపమును జయించినాడు. మనుష్యుడు పాపమును జయింపలేక పోయినాడు. గనుక యేసుప్రభువువచ్చి జయించినాడు. మనమైతే జయించలేదుగాని ఆయన జయించినందువలన ఆ జయము మన జయమాయెను. (యేసు క్రీస్తు ప్రభువొందిన జయమే – ఎల్లవారికొను – కోరిన ఎల్లవారికొను–వేడిన

ఎల్లవారికొను – నమ్మిన ఎల్లవారికొను = యేసు పేరె మీ చిక్కులపైన వేసికొన్న జయము – జయమని వ్రాసికొన్న జయము. సాద్విలాస్) దేవుని జత ఎవరికి కావలెను. వారు ఇమ్మానుయేలు అను పేరు చూచి ఆనందింతురు, స్మరింతురు, పూజింతురు. ఇది దేవుడు భూమిమీదికి వచ్చినప్పుడు పెట్టుకొన్న పేరు. అట్లే యేసు అను పేరుకూడ దేవుడు ఈ లోకమునకు వచ్చినప్పుడు పెట్టుకొన్నపేరే. క్రీస్తు అన్నపేరుకూడ దేవుడు ఈ లోకమునకు వచ్చినప్పుడు పెట్టుకొన్నపేరే. ఈ పేర్లు మన ఉపయోగము నిమిత్తమై తాను పెట్టుకొని తన ప్రేమను బైలుపరచిన పేర్లు గనుక మనము ఈ పేరులను స్మరించుట యుక్తము.

క్రీస్తు : ఈ పేరుకూడ దేవుడు ఈ లోకమునకు వచ్చినప్పుడు పెట్టుకొన్న పేరు. ఇదికూడ మోక్షలోకమునుండి వచ్చిన నామమే. స్వదేశ నామముకాదు విదేశనామముకాదు, మోక్షలోకనామము. గనుక లోకస్తులందరు గౌరవింపవలసిన నామము. క్రీస్తు అనగా అభిషిక్తుడని అర్థము. ఒక రాజ్యమును ఏలు పనిమీద ఒక రాజు ఎట్లు పట్టాభిషేకము పొందునో అట్లే మనుష్యులను రక్షించే పనిమీద ఈయన (యేసుక్రీస్తు ప్రభువు) అభిషేకము పొందినాడు. అందుచేత ఈ పేరు ఆయనకు తగియున్నది. రాజు అధికారముతో రాజ్యము ఏలేపని చేయడమే గొప్పపని. అభిషేకము పొందినాడు అనగా ఏమి? ఒకపనిమీద, ప్రత్యేకమైన ఒక పనిమీద నియమించబడియున్నాడని అర్థము. క్రీస్తు అనగా రక్షించేపనికి ఏర్పాటైన వ్యక్తి అని అర్థము. లోకములో మనుష్యులకున్న కష్టములనుంచి కొంత వరకు తాత్కాలికముగా రక్షించు రక్షకుడు ఉండవచ్చును. ఉన్నారు గాని పాపము నుండియు, మరణమునుండియు, పాపకారకుడైన సాతానునుండియు, రక్షించే రక్షకుడు లేడు. ఈయన ఆ పనికి ఏర్పాటై వచ్చినాడు. క్రీస్తు అనగా ఇదే అర్థము. క్రీస్తు అనే ఈ నామము అనేకమందికి అభ్యంతరముగా నుండుమాట అని మాకు తెలియును. దీని అర్థము. చెప్పుచుండగా ఒక ప్రశ్న చదువువారి మనసులో పుట్టక మానదు. ఆ ప్రశ్న ఏమనగా– ఈయన ఒక్కడేనా ఈ రక్షించేపనికి ఏర్పాటైనవాడు? ఇంకెవరులేరా? ఇది న్యాయమైన ప్రశ్న. అడుగవలసిన ప్రశ్న. తెలిసికొనవలసిన ప్రశ్న. మేము

క్రీస్తుప్రభువుయొక్క చరిత్ర. బైబిలు కథలు చెప్పిన అన్ని మతములవారు సంతోషముతో ఆలకింతురు. నెమ్మదిగా కూర్చుని ఆలకింతురు. ఇమ్మానుయేలు యేసు క్రీస్తు– ఈ మాటలు సంతోషముతో విందురు. గాని యేసుక్రీస్తు ఒక్కడే రక్షకుడు అని చెప్పగానే ఒకరి తర్వాత ఒకరు ప్రశ్నలు వేయుదురు. లేచిపోవుదురు. అయితే బైబిలులో ఈ మాట ఉన్నది గనుక మేము చెప్పక తప్పదు. దేవుడు ఈ పేరులలో బయలుపడినాడు గనుక మేము ఈ మాటలు వినిపించక తప్పదు. నేను ఇచ్చే ఈ మాత్ర తీసికొనిన నీ జబ్బు పూర్తిగా పోవును అని ఒక వైద్యుడు చెప్పిన మనమేమందుము? వేసికొని చూచి పరీక్షింతుముకదా? అలాగే యేసుక్రీస్తు అను ఒక నామమును మనము వాడుకొని పరీక్షించినప్పుడు మనము ఆనందించగలము. అందరికి అనుగుణ్యమైన పేర్లు యేసుప్రభువునకు గలవు. మరియొక సంగతి పేరుకు తగినట్టు ఆయన నడచినాడని ఆయన కథవల్ల తెలియుచున్నది. పేరు ఒక విధముగా నుండి చరిత్ర ఇంకొక విధముగానున్న నమ్ముటకు సంశయము, గాని క్రీస్తు చరిత్ర ఆలాగులేదు. యేసు క్రీస్తుప్రభువు పుట్టినప్పుడు దేవదూత గొల్లలకు ఏమిచెప్పినది జ్ఞాపకము చేయుదును. ఆ మాట ఏదనగా 'మీ కొరకు రక్షకుడు పుట్టియున్నాడు'. తరువాత ఈ సంతోషము ప్రజలందరికి కలుగనైయున్నది. దూతయొక్క ఆహ్వానములో ఈ రెండు సంగతులు గలవు. ఎదుటనున్న గొల్లలకు, ఎదుటలేని ప్రజలకును ఈయన రక్షకుడని ఈ రెండు మాటలవలన తెలియుచున్నది. కాబట్టి మొదట వినిన గొల్లలు ఏమని అనుకొనుట న్యాయము? యేసుక్రీస్తు మా రక్షకుడు. మా రక్షకుడు అని చెప్పుకొనుట న్యాయము. ఆ తర్వాత ఈ వార్త విన్నవారందరు ఇదే రీతిగా ఆయన మా రక్షకుడుకూడా అయ్యున్నాడని చెప్పుకొనుట సబబుగా నుండును. (మీ కొరకు) (ప్రజలందరి కొరకు) అను అర్ధముకూడ క్రీస్తు అను మాటలో నున్నది. ప్రత్యేకమైన రక్షకుడు అను అర్ధముకూడ నున్నది. తక్కిన రక్షకులకంటె గొప్పవాడు అనికూడ నున్నది. ఈ అర్ధము, ఈ నామములు ఎవరికి వచ్చునో వారు మాత్రమే వీటివల్ల కలుగు ఆనందము పొందగలరు. యేసు అనగా రక్షకుడు. క్రీస్తు అనగా నాయొక్క అని అర్ధము. యేసు క్రీస్తు అనగా నా ప్రత్యేక రక్షకుడు అని అర్ధము.

ప్రథమ	ముద్రణ	1960	ప్రతులు	1000
ద్వితీయ	ముద్రణ	1983	"	1000
తృతీయ	ముద్రణ	1988	"	1000
చతుర్థ	ముద్రణ	1993	"	5000
పంచమి	ముద్రణ	2004	"	3000

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బైలుపరచిన

బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 0863- 2556644; 2556149.

(చాయ : పరమదేశమిదుగో)

త్వరగా రానున్న యేసూ!-త్వరగానే రమ్ము తండ్రీ= త్వరగా వచ్చు
ప్రభువా చురుకు-తనమిమ్మునే త్వరపడగలను ॥త్వరగా॥

1. నేనిక సిద్దంబుగా-లేనని తెలిసినది నిరుకు=గానన్ పరిశుద్ధాత్మయె
నన్ను-కడకు సిద్ధము జేసికొనును ॥త్వరగా॥

2. రాకడ సామీప్యమన్న-లోకము హేళన చేయు=లోకముతో నీ
సంఘము కూడ-ఏకమాయెను ఏమి చేతును ॥త్వరగా॥

3. ప్రతివాని మతికి రాకడ-ధ్వని వినిపించుమో రాజా!=క్షితి నిమిత్త
మిదియే ప్రార్థన-స్తుతి చేతును నీ కనుదినంబును ॥త్వరగా॥

4. విశ్వాసులె నేటి రాకడ-విశ్వసింపరంచు జెప్పి=విశ్వాసము పోగొట్టు
కొనక-విశ్వాసము చే పట్టుకొందును ॥త్వరగా॥

5. ప్రభువైన యేసూ రమ్మను-ప్రార్థన నేర్పుమో ప్రభువా!= సభలకు
మాత్రమే కాక ఇతర-జనులకు కూడ నిదియే ప్రార్థన ॥త్వరగా॥

6. రాకడ నమ్మిక అరిగి-పోక ముందె రమ్ము తండ్రీ!= రాకడకు సిద్ధము
గాకున్న-లోకము హేళన చేయక మానదు ॥త్వరగా॥

7. జనక సుతాత్మలకు స్తుతులు-సంఘ వధువు వల్ల భువిని= మనసున
స్తుతి=కార్యము తప్ప మరి-పని యేమున్నది భక్త జనాళికి ॥త్వరగా॥